సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



ఐదేళ్లుగా పునరుద్ధరించలేదు!
సికింద్రాబాద్ – నడికుడి మార్గంలోని రామన్నపేట రైల్వే స్టేషన్‌లో కొంతకాలంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడం లేదు. - 8లో



పారిశ్రామిక విధానం అద్భుతం
రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అద్భుతంగా ఉందని ఎన్‌డీసీ మేజర్ జనరల్ సమర్థ్ పేర్కొన్నారు. - 10లో



కళాత్మకంగా ఇక్కత్ వస్త్రాలు
పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో కళాత్మకంగా ఉన్నాయని ఎన్‌డీసీ అధికారుల బృందం కొనియాడింది. - 10లో

న్యూస్‌రీల్

భోజనం, వసతులు ఎలా ఉన్నాయి


వృద్ధాశ్రమంలో వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న జడ్జి మాధవిలత

భువనగిరి : మండలంలోని రాయగిరి పరిధిలో గల సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవిలత సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వసతులు, భోజనం ఎలా ఉందటూ ఆరా తీశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా మానసిక ఆరోగ్య అధికారి ప్రీతి స్వరూప్, సిబ్బంది భానుకుమార్, సురేష్ ఉన్నారు.

హామీలు నెరవేర్చి మాట నిలుపుకోవాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి మాటనిలుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ కల్పించడం ద్వారా ఆటోల్లో ప్రయాణికులు ఎక్కడం లేదన్నారు. దీంతో ఆటో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. హామీ అమలు చేయాలని కోరారు. తుమ్మల ఇస్తారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు పాల్గొన్నారు.

యాగశాల ఏర్పాటుకు మార్కింగ్


ఆలయ ఉత్తర మాడ వీధిలో మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 23న నిర్వహించనున్న మహాకుంభ సంప్రోక్షణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా యాగశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సోమవారం ఆలయ ఉత్తర మాడ వీధిలో మార్కింగ్ చేశారు. 32 ఫీట్ల వెడల్పు, 32 ఫీట్ల పొడవుతో యాగశాలను నిర్మాణం చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా వసంతకుమారి




నల్లగొండ టౌన్ : మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలనకు జాతీయ ఐఎంఏ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జాతీయ గైనకాలజిస్ట్ అసోసియేషన్లు నడుం బిగించాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 50 వేల మంది గైనకాలజిస్టులు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయాలని నిర్ణయించాయి. అందులో భాగంగా రాష్ట్రంలోని గైనకాలజిస్టులకు శిక్షణ ఇచ్చేందుకు నల్లగొండకు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ వసంతకుమారిని కోఆర్డినేటర్‌గా జాతీయ ఐఎంఏ నియమించింది. ఈ నెల 4న నకిరేకల్‌లో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 20 మంది, 7న నల్లగొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 20 మంది బాలికలకు వ్యాక్సినేషన్ చేయనున్నట్లు వసంతకుమారి తెలిపారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్స్

భువనగిరి : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొదటి రోజు ఉదయం జరిగిన పరీక్షకు 1,221 మంది విద్యార్థులకు గాను 1,143 హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 929 మంది విద్యార్థులకు 892 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు. సీసీ కెమెరాల నీడలో పరీక్షలు జరిగాయి.

కొత్త పథకాలకు బ్రేక్!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్.. రైతుభరోసా మినహా నిలిచిపోనున్న మూడు స్కీంలు



- కోడ్ ముగిసిన తరువాతే తిరిగి పథకాలు పునరుద్ధరణ
- పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఇప్పటికే ప్రొసీడింగ్స్ అందజేత
- లబ్ధిదారులకు కొంతకాలం తప్పని నిరీక్షణ

సాక్షి, యాదాద్రి : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ మూడు పథకాలు నిలిచిపోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న కొత్తగా నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కూడా అందజేశారు. మిగతా గ్రామాలకు కూడా వర్తింపజేయాల్సి ఉంది. కానీ, ఎన్నికల కోడ్ రావడంతో నిబంధనల ప్రకారం రైతుభరోసా మినహా మిగతా మూడు పథకాలు నిలిచిపోనున్నాయి. కోడ్ ముగిసిన తరువాత పథకాలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

సొంతింటి కోసం ఆగాల్సిందే..
పేదల సొంత ఇంటి కల నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేసింది. గ్రామ సభలు నిర్వహించి 56,964 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో 1,144 లబ్ధిదారులకు అధికారులు ప్రొసీడింగ్స్ అందజేశారు. కానీ, ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఎన్నికల కోడ్ ముగిసేదాకా పనులు చేపట్టవద్దని అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ప'రేషన్'
కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, మీసేవ కేంద్రాలు, గ్రామ సభల్లో జిల్లా వ్యాప్తంగా 70,781 దరఖాస్తులు వచ్చాయి. పైలట్ గ్రామాలకు 910 కార్డులు మంజూరయ్యాయి. ఇందులో సుమారు 5 వేల యూనిట్లకు బియ్యం కోటా విడుదల చేశారు. ఇంకా 65 వేల యూనిట్లకు సరఫరా చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్ ముగిస్తేనే బియ్యం కోటా విడుదల కానుంది. అంతేకాకుండా దరఖాస్తుదారుల్లో ఇంకా చాలా మందికి కార్డులు మంజూరు చేయాల్సి ఉంది. ఎన్నికలు ముగిసేదాకా ఈ ప్రక్రియ కూడా నిలిచిపోనుంది.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిరీక్షణ
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి జిల్లా వ్యాప్తంగా 16,297 మంది ఎంపికయ్యారు. ఇందులో 329 మందికి జనవరి 26న ప్రొసీడింగ్ అందజేయగా.. వారందరి ఖాతాల్లో నగదు జమ అయ్యింది. ఇంకా 15,900 మంది ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్నారు.

నేటినుంచి 'రైతుభరోసా' ?
రైతుభరోసా డబ్బులు యథావిధిగా మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లో జమకానున్నట్లు తెలుస్తోంది. జనవరి 26వ తేదీన 17,644 మంది రైతుల ఖాతాల్లో రూ.26,95,17,733 జమ చేశారు. ఇంకా 28,1464 మంది రైతులకు సంబంధించి రూ.36.39 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

● చిన్నారులకు అక్షరాభ్యాసం



వసంత పంచమి సందర్భంగా సోమవారం రామన్నపేటలోకి క్రిష్ణవేణి హైస్కూల్‌లో చిన్నారులకు ఓనమాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి

● కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ : ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. సోమవారం ఆయన వలిగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణితో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ధరణి దరఖాస్తుల్లో ఇప్పటి వరకు పరిష్కరించనవి, పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కాకుండా చూడాలన్నారు.

కేజీబీవీ తనిఖీ..
లోతుకుంట గ్రామంలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. భోజనం ఎలా ఉందని తెలుసుకున్నారు. కోతులు వస్తున్నాయని, భోజన సమయంలో ఇబ్బందిగా ఉందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా.. పాఠశాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి ఉన్నారు.


వలిగొండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

187 మంది బాలకార్మికుల గుర్తింపు


తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న బాలల పరిరక్షణ విభాగం అధికారులు

- పనిచేసే ప్రాంతాల నుంచి బాలలకు విముక్తి
- పనిలో పెట్టుకున్న 73 మంది యజమానులపై కేసులు నమోదు
- వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగిన ఆపరేషన్ స్మైల్

భువనగిరి : జిల్లాలో నిర్వహించిన 11వ విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 187 మంది బాలకార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. గుర్తించిన బాలలను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బడికి పంపకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివిధ శాఖల భాగస్వామ్యంతో..
బాలకార్మిక వ్యవస్థను నిర్మూలనే లక్ష్యంగా ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా జనవరి 1నుంచి 31వ తేదీ వరకు పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటెక్షన్, కార్మిక, విద్యాశాఖలు మూడు బృందాలుగా ఏర్పడి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 187 మందిని గుర్తించగా.. వీరిలో బాలురు 178, బాలికలు 9 మంది ఉన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న 73 మంది యాజమానులపై కేసు నమోదు చేశారు. గుర్తించిన బాలల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి సీడబ్ల్యూసీ ద్వారా అప్పగించినట్లు ఐసీడీఎస్ పీడీ తెలిపారు.

11 విడతల్లో 827 మందికి విముక్తి
జిల్లాలో 2017 నుంచి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 11 విడుతల్లో 827 మందిని బాలకార్మికులకు గుర్తించి వారిని తల్లింద్రులకు, సంరక్షులకు అప్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

● తొలిరోజు ఒక్కటే నామినేషన్ దాఖలు ● మీడియా సెంటర్ ప్రారంభం


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి వెంకటేశ్వర్లు


మీడియా సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ప్రజావాణి పార్టీ లభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్
ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు వివిధ మాధ్యమాల ద్వారా జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎంసీఎంసీ సభ్యులు కోటేశ్వరరావు, శేషాచార్యులు, కలెక్టరేట్ ఏవో మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది లేక సేవలందక
గుండాల మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం -2 కొంతకాలంగా తెరుచుకోవడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న టీచర్, ఆయా గత ఏడాది జూలైలో పదవీ విరమణ పొందారు. కొత్తవారిని నియమించకపోవడంతో అప్పటి నుంచి కేంద్రాన్ని తెరిచేవారు లేరు. లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్-1లో కలిపినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాకుపాషా బేగంతెలిపారు. - గుండాల

కాంగ్రెస్‌లో కయ్యం!


మోత్కూరులో నిర్వహించిన సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

తుంగతుర్తిలో ముదురుతున్న వర్గపోరు
- ఎమ్మెల్యే సామేల్‌పై అసమ్మతి గళం
- రెండు వర్గాలుగా చీలిన నాయకులు
- భువనగిరి, ఆలేరులోనూ కుమ్ములాట

సాక్షి, యాదాద్రి : జిల్లా కాంగ్రెస్‌లో రోజుకో పంచాయతీ తెరపైకి వస్తోంది. డీసీసీ ఉపాధ్యక్షుడి నియామకంతో తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు బట్టబయలు అయ్యాయి. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా పార్టీ పదవులు ఎలా ఇస్తారని ఎమ్మెల్యే మందుల సామేల్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ప్రశ్నించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎమ్మెల్యే సామేల్ విధానాలను, ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పార్టీలోని ఒక వర్గం మోత్కూరులో సమావేశం నిర్వహించడం వర్గ పోరును మరింత రాజేసింది.

ముసలం మొదలైంది ఇలా..
మోత్కూరుకు చెందిన సీనియర్ నేత పైళ్ల సోమిరెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడంతో తుంగతుర్తి నియోజకవర్గ పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. నా నియోజకవర్గంలో కోమటిరెడ్డి జోక్యం ఏమిటని, నాకు తెలియకుండా నా నియోజకవర్గం వ్యక్తులకు పదవులు ఎలా ఇస్తారంటూ.. ఎమ్మెల్యే సామేల్ బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్గతంగా ఉన్న విభేదాలు కాస్తా రచ్చకెక్కాయి. సోమవారం మోత్కూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసమ్మతివాదులు ఎమ్మెల్యే సామేల్‌పై విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం 30 సంవత్సరాలుగా కష్టపడి పని చేశామని, ఆర్థికంగా నష్టపోయి, కేసుల పాలైనా తమకు తగ్గినగుర్తింపు లేదన్నది అసమ్మతి వర్గం వాదన. బీఆర్‌ఎస్‌లో ఉంటూ కాంగ్రెస్‌ను ఓటమికి ప్రయత్నించిన వారు ఇటీవల కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారని, వారికి పెద్ద పీట వేయడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో సంబంధం ఉన్న నాయకులను సైతం పక్కన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సామేల్ తన కుమారులకు కాంట్రాక్టులు ఇప్పిస్తున్నాడని, కాంట్రాక్టర్ల వద్ద పెద్ద ఎత్తున కమీషన్లు వసూలు చేయిస్తున్నాడని, ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడని ఆరోపిస్తున్నారు.

భువనగిరి, ఆలేరులోనూ..
భువనగిరి, ఆలేరులోనూ పార్టీ శ్రేణులు, నాయకుల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. జనవరి 26న భువనగిరిలో డీసీసీ కార్యాలయం ప్రారంభోత్సవం సదర్భంగా ఫ్లెక్సీల్లో ఫొటోలపై వివాదాం తలెత్తింది. తమ ఎమ్మెల్యే ఫొటోలు లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారంటూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అనుచరులు గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. ఇక ఆలేరు ఎమ్మెల్యే ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని పలువురు నేతలు విమర్శలు చేస్తున్నారు. మోటకొండూరులో జరిగిన యువజన కాంగ్రెస్ నూతన కమిటీ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఫొటో లేకుండానే సభ జరిగింది. పార్టీలో నెలకొన్న పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వం

● ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్


సమావేశంలో మాట్లాడుతున్న నాగరిగారి ప్రీతమ్

మోత్కూరు : దశాబ్ద కాలంగా పార్టీ అధికారంలో లేకపోయినా ఆటుపోట్లను ఎదుర్కొని కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగనివ్వమని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీస్ కేసులు బనాయిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సోమవారం మోత్కూరులో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మోత్కూరు మండల పార్టీ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రీతమ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన కార్యకర్తలు పోటీచేసేందుకు బి-ఫామ్‌లు అందిస్తానని, వారి విజయం కోసం ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు ధరూర్ యోగానందాచార్యులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సామేల్ వెంట ఉంది బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులేనని అన్నారు. నిజమైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు అర్వపల్లిలో సమావేశం నిర్వహిస్తే పోలీస్ బలగాలతో అరెస్టు చేయించి అక్రమ కేసులు బనాయింపజేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన నిజమైన శ్రేణులను గుర్తించి స్థానిక సంస్థల్లో పార్టీ టికెట్ ఇవ్వాలన్నారు. ఇటీవల యాదాద్రి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకునే వారికి అన్యాయం కానివ్వనని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వంగాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, పత్రెపాటి యుగేందర్, నాయకులు నారబోయిన అంజయ్య, గూడెపు నాగరాజు, గూడెపు పాండు, రాచకొండ రమేష్, రాఘవేందర్‌రెడ్డి, నర్సయ్య, తండ సత్తయ్య, బండారు ప్రశాంత్‌రెడ్డి, కొమ్ము రాజేష్, కప్పల రాజేష్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సంప్రదాయ పూజలు


యాదగిరిగుట్ట శివాలయంలో స్పటిక లింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నేత్రపర్వంగా చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు ముఖ మండపంలో స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రధానాలయంలో..
నృసింహుడి ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాతం సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళాలతో అర్చించారు. అదే విధంగా శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నేటి నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

- రేపు తెల్లవారుజామున స్వామివారి కల్యాణం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు రథ సప్తమి సందర్భంగా మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శైవాగమ పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మతో పాటు మరో 20 మంది అర్చక బృందంతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నట్లు ఈఓ సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


గర్భగుడిలోని రామలింగేశ్వరుడు

కల్యాణం తిలకించేందుకు 6 స్క్రీన్లు ఏర్పాటు

స్వామివారి కల్యాణ్యాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా గట్టుపై, కొండ కింద 6 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఘాట్ రోడ్డు ఇరువైపులా బారికేడ్లతో పాటు ఘాట్ రోడ్డులో వివిధ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. ప్రతిరోజు రాత్రి కొండ పైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చెర్వుగట్టు జాతరకు స్పెషల్ బస్సులు

రామగిరి(నల్లగొండ) : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లగొండ ఆర్టీసీ డిపో నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నామని ఆర్ఎం కె.జానిరెడ్డి తెలిపారు. మంగళవారం స్వామి కల్యాణం జరగనున్న నేపథ్యంలో భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకుని డిపో నుంచి 20 స్పెషల్ బస్సులు నడపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


చెర్వుగట్టు పైకి వెళ్లే ప్రధాన ద్వారం

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి సూచించారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వర్తించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో సోమవారం డీఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిఘా టీం చురుకుగా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. కల్యాణం జరిగిన అనంతరం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తుంటారని పేర్కొన్నారు. సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, నల్లగొండ సీఐ రాఘవరావు, నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం



బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కల్గ కుండా నీటి సౌకర్యం, మరుగుదొడ్లతో పాటు ప్రసాదం విక్రయించడానికి గట్టు పైన, కింద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తులు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలి. నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

క్లుప్తంగా

సహకార సంఘం ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో సుధాకర్‌రెడ్డి

నడిగూడెం: నడిగూడెం సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగి సంఘం చైర్మన్ వేధింపులు తట్టుకోలేక సోమవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన బీరవల్లి సుధాకర్‌రెడ్డి నడిగూడెం సహకార సంఘంలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సుధాకర్‌రెడ్డి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత ఆరు నెలలుగా సహకార సంఘం చైర్మన్ తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అది తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై చైర్మన్ కొల్లు రామారావును సంప్రదించగా సుధాకర్‌రెడ్డిపై ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

కోదాడరూరల్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం కాలనీకి చెందిన కొండపల్లి జయంత్ (28) ఆటో డ్రైవింగ్ చేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం శిరీష అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్దిరోజులుగా జయంత్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో జయంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి భార్య శిరీష గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తల్లి గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం


పోలీసుతో నజీర్

తిరుమలగిరి: తప్పిపోయిన బాలుడి ఆచూకీని పోలీసులు రెండు గంటల్లో కనిపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన నజీర్ పాషా తుంగతుర్తి మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఇటీవల పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. సోమవారం తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమనగా.. ఫోన్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. నజీర్ పాషా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా నజీర్ పాషా తొర్రూరలో ఉండగా పట్టుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

క్యాంపస్ సమాచారం

ఎంజీయూ ఆధ్వర్యంలో 'ఐసెట్' నిర్వహణ

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కొరకు నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐసెట్)–2025ను ఈ ఏడాది మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ కన్వీనర్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసెట్ నోటిఫికేషన్‌ను మార్చి 6వ తేదీన విడుదల చేసి జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు రుసుము జనరల్ అభ్యర్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.550 చెల్లించాలని పేర్కొన్నారు.

స్పిన్‌ట్రానిక్స్ రంగంపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనాథ్

నల్లగొండ టూటౌన్: స్పిన్‌ట్రానిక్స్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనాథ్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులకు స్పిన్‌ట్రానిక్స్‌లో పరిశోధన, ఉపాధి వాణిజ్య అవకాశాలపై ఆయన అవగాహన కల్పించారు. వేగవంతమైన సమాచారాన్ని చేరవేయడంతో పాటు డేటా నిక్షిప్తం చేయడంలో స్పిన్‌ట్రానిక్స్‌కు మంచి భవిష్యత్తు ఉందని వివరించారు. కార్యక్రమంలో కె. సత్తిరెడ్డి, ప్రేమ్‌సాగర్, ఎన్. భిక్షమయ్య, రమేష్, శాంతికుమారి, ఎస్. ఆదిరెడ్డి, బి. వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు


కట్టంగూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు

కట్టంగూర్: కట్టంగూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో కట్టంగూర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సబ్‌స్టేషన్ పైభాగంలో ఉన్న పీటీ(పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్)లో షార్ట్ సర్క్యూట్‌తో కావడంతో మంటలు వచ్చాయి. పీటీలో ఉన్న ఆయిల్ కారణంగా మంటలు అలుముకున్నాయి. అధికారులు మంటలు ఆర్పివేసి పీటీకీ మరమ్మతులు చేపట్టి మూడు గంటల్లో విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరించారు.

దొంగతనం కేసులో ఒకరు అరెస్ట్

వేములపల్లి: జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం సీఐ వీరబాబు, ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు విలేకరులకు వెల్లించారు. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన పోల కల్పన భర్త చనిపోగా ఇంట్లో పిండి మిల్లు నడుపుకుంటూ తన ఇద్దరు కుమార్తెలను హైదరాబాద్‌లో చదివిస్తోంది. గత నెల 2వ తేదీన ఆరోగ్యం బాగోలేకపోవడంతో కల్పన నాగర్‌కర్నూల్‌లోని తన తల్లిగారింటికి వెళ్లింది. అదే రోజు రాత్రి ఆమె ఇంటి ఎదురుగా ఉంటున్న దాసోజు నరేష్‌కుమార్ కల్పన ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన రూ.20వేల నగదు, 1.6గ్రాముల చంద్రహారం, ఆరు గ్రాముల రెండు చేతి ఉంగరాలు, నాలుగు గ్రాముల రెండు జతల చెవి దిద్దులను దొంగలించాడు. దొంగిలించిన బంగారు ఆభరణాలను కుటుంబ సభ్యులకు తెలియకుండా తన ఇంట్లో సజ్జా మీద దాచి పెట్టాడు. నగదు తీసుకోని హైదరాబాద్, తిరుపతి, నల్లగొండ ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. సోమవారం ఎవరికి అనుమానం రాకుండా తన ఇంట్లో దాచిపెట్టిన బంగారు ఆభరణాలను తీసుకొని సూర్యాపేటలో అమ్మేందుకు బయల్దేరాడు. శెట్టిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా నిలబడి ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించగా చేసిన నిజం ఒప్పుకుని బంగారు ఆభరణాలను అప్పగించినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని రైల్వే స్టేషన్‌లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్–2పై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దగ్గరలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, చామన ఛాయ రంగు, తెల్లని చొక్కా, నల్లని గీతల ప్యాంట్, స్వెట్టర్ ధరించి ఉన్నాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఎత్తు 5.5 అడుగులు, తెల్లని గడ్డం, జుట్టు, ఎడమ, కుడి ఛాతిపై పుట్టుమచ్చలు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడు ముస్లిం వ్యక్తిలా ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు తెలియజేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9848222169, 8712568454 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాలువలో పడి మాజీ ఎంపీటీసీ మృతి

పెద్దఅడిశర్లపల్లి: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కాలువలో పడి మాజీ ఎంపీటీసీ మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం యల్లాపురం గ్రామానికి చెందిన గుండాల గోవింద్ (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం గోవింద్ బైక్‌పై అదే గ్రామానికి చెందిన బొమ్ము అంజయ్యతో కలిసి అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వస్తుండగా.. మార్గమధ్యలో మేడారం సమీపంలోకి రాగానే రోడ్డుపై గుంతలు ఉండటంతో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న అంజయ్య కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కాలువ నుంచి వారిని బయటకు తీయగా.. గోవింద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గోవింద్ గతంలో సంభాపురం ఎంపీటీసీగా పనిచేశారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.


గుండాల గోవింద్ (ఫైల్)

ఐదేళ్లయినా పునరుద్ధరించలేదు

- చిట్యాల, రామన్నపేట, వలిగొండ రైల్వే స్టేషన్లలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- కరోనా లాక్‌డౌన్ సమయంలో రద్దు
- రవాణా పరంగా ఇబ్బందులు
- రోజు 500 మంది వరకు రాకపోకలు

రామన్నపేట: సికింద్రాబాద్–నడికుడి మార్గంలో రామన్నపేట రైల్వే స్టేషన్ ఉంది. రామన్నపేట గతంలో అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నియోజకవర్గాల పునరుద్ధరణలో తిరిగి అసెంబ్లీ కేంద్రంగా ఏర్పాటుయ్యే అవకాశం ఉంది. నాలుగైదు మండలాలకు ప్రధాన కూడలి. పలు మండలాల ప్రజల సౌకర్యార్థం రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేసి దశలవారీగా అభివృద్ధి చేశారు. సికింద్రాబాద్–తిరుపతి మార్గంలో నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు, సికింద్రాబాద్–విశాఖపట్ణం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా మధ్య నడిచే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు కాచిగూడ–మిర్యాలగూడ మధ్య తిరిగే డెమో రైలు, సికింద్రాబాద్–రేపల్లె మధ్య నడిచే రేపల్లె ప్యాసింజర్ రైళ్లు ఉదయం, సాయంత్రం వేళ రామన్నపేటలో ఆగేవి. ఆయా రైళ్లు అనేక వర్గాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవి. ఐదేళ్ల క్రితం కరోనా మొదటి వేవ్ విజృంభిస్తున్న సమయంలో ప్రభుత్వం రైళ్ల రాకపోకలను నిలిపి వేసింది. కరోనా ఎఫెక్ట్ నుంచి కోలుకున్న తర్వాత దశలవారీగా రైళ్లను పునరుద్ధరించారు. రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు రేపల్లె ప్యాసింజర్ రైళ్ల స్టాప్‌లను ఎత్తివేశారు. కేవలం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, డెమోను మాత్రమే ఆపేవారు. అనేక విజ్ఞప్తుల అనంతరం రేపల్లె ప్యాసింజర్ రైలును గతేడాది మార్చి నుంచి ఆపుతున్నారు. గత నెలలో వారం రోజులు రేపల్లె రైలు స్టాప్‌ను ఎత్తివేయగా స్థానికుల ఒత్తిడి మేరకు తిరిగి పునరుద్ధరించారు. అలాగే చిట్యాల, వలిగొండ రైల్వే స్టేషన్లలోనూ హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మూడు స్టేషన్ల నుంచి రోజూ హైదరాబాద్, మిర్యాలగూడ వైపు 500 మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో రోజు కూలీలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.


రామన్నపేట రైల్వే స్టేషన్

తిరుపతి వెళ్లాలంటే నల్లగొండలో ఎక్కాలి

నాలుగేళ్లుగా రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడం లేదు. తిరుపతి వెళ్లే భక్తులు నల్లగొండకు వెళ్లి అక్కడ రైలు ఎక్కాల్సి వస్తుంది. అదేవిధంగా రామన్నపేట రైల్వే స్టేషన్ పరిసర మండలాలైన చౌటుప్పల్, చిట్యాల, పోచంపల్లి, వలిగొండ మండలాల పరిధిలోని ఫార్మా కంపెనీలు, రైస్ మిల్లులు, భవన నిర్మాణం తదితర రంగాల్లో బిహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికుల కుటుంబాలు పనిచేస్తున్నాయి. వారు తమ స్వస్థలాలకు వెళ్లి రావడానికి ఐదు రాష్ట్రాల గుండా నడిచే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైల్వే అధికారులు స్పందించి నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామన్నపేటలో ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నటువంటి నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడేళ్లుగా రామన్నపేటలో ఆపడం లేదు. తిరుపతి వెళ్లే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. రైళ్లు ఆపాలని ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా రైల్వే అధికారులను కోరాం. ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపి ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

– వనం చంద్రశేఖర్, రామన్నపేట

కేంద్ర మంత్రిని కలిశాం



నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడారు. త్వరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే అవకాశం ఉంది.

– బండ మధుకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, రామన్నపేట

కుటుంబ తగాదాలతో వృద్ధుడు మృతి

డిండి : కుటుంబ తగాదాల కారణంగా వృద్ధుడి తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి డిండి మండల పరిధిలోని గోనబోయనపల్లిలో జరిగింది. గోనబోయనపల్లి గ్రామానికి చెందిన బద్దె రాములు(65)తో అతడి కోడలు ఆదివారం రాత్రి గొడవకు దిగింది. ఈ క్రమంలో ఆమె కర్రతో రాములను కొట్టి రోడ్డు పైకి నెట్టి వేయడంతో అతడి తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్‌ఐ రాజు తెలిపారు.

వాహ్.. వాట్ ఎ టెక్నిక్ !



రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన సుర్వి బాలరాజు వాటర్ ట్యాంకర్‌తో అవసరమైన వాళ్లకు నీటిని సరఫరా చేస్తుంటాడు. రామన్నపేట పట్టణంలో వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్లకు నీటిని చల్లి క్యూరింగ్ చేసే బాధ్యతను తీసుకున్నాడు. ట్యాంకర్ వెనుక పైపునకు గేట్‌వాల్‌ను బిగించి చివరన రంధ్రాలు చేసిన వాటర్ బాటిల్‌ను అమర్చాడు. గేట్‌వాల్ తెరవగానే బాటిల్ రంధ్రాల గుండా 10 ఫీట్లతో వేసిన రోడ్డుపై ఒక్కరీతిగా నీళ్లు వెదజల్లుతున్నాయి. చిన్న ఉపాయంతో ట్యాంకర్ వెనుక మరో మనిషి అవసరం లేకుండాపోయింది.

– రామన్నపేట

కందిని ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు



పెద్దవూర: కందిలో సస్యరక్షణ పద్ధతులను సకాలంలో చేపట్టడం ద్వారానే మేలైన దిగుబడులు సాధించవచ్చునని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు. కందిని ఆశించే తెగుళ్లు, పురుగులు వాటి నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే..

పూత పురుగు(మారుకా మచ్చల పురుగు) : లేద ఆకులపై, పూత పైన గుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చే ల్వారాలు ఆకు, పూలు, పిందెలున్న మొక్క చివరన గూడు చేసుకుని లోపల చేరి ఆకులు, పూలు, మొగ్గలను తింటూ పెరుగుతాయి. ఈ లార్వాలు 13–18 రోజుల వ్యవధిలో గూడులోనే ప్యూపాలుగా మారి తిరిగి 5–7 రోజుల వ్యవధిలో తల్లి పురుగులుగా రూపాంతరం చెందుతాయి.

నివారణ : పురుగు ప్రారంభ దశలో ఎకరాకు 1 లీటరు వేప నూనెను పిచికారీ చేయడం వలన నివారించవచ్చు. ఒక లీటర్ నీటిలో మోనోక్రోటోఫాస్, డైక్లోరిఫాస్ 1.6 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా లీటరు నీటిలో క్లోరిఫైరిఫాస్, డైక్లోర్‌వాస్ 0.1 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒక మిల్లీలీటరు డైక్లోర్‌వాస్(నువాన్)ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం వలన పూతపురుగు బెడదను నివారించవచ్చు.



ఆకుముట్టు పురుగు : కంది పంట లేత దశలోనే తల్లి పురుగులు ఒక్కొక్క గుడ్డును ఆకుల ఈనెల పక్కన పెడతాయి. తొలి దశ లార్వాలు ఆకు పైపొరలను తొలిచి లోపలికి వెళ్లి గూడు చేసుకుని పెరుగుతాయి. తర్వాత దశ లార్వాలు తమ నోటి దారాలతో ఆకుల్ని దగ్గరకు చేర్చి మధ్యలో చేరి తమ నోటితో పత్రహరిత కణాలను గీకివేసి పెరుగుతుంటాయి. ఆకు ముడతల్లో ప్యూపా దశకు చేరుతుంది. మొదటి దశలో ఏర్పడిన బొబ్బలు విస్తరించబడి ఆకులపై ఎండు మచ్చలు ఏర్పడతాయి. అదేవిధంగా ఆకులు ముడత పడటం, చుట్టుకుపోవడం, ఎండిపోవడం జరుగుతుంది.

నివారణ : వేప సంబంధిత మందుల ద్వారా నివారించవచ్చు. లీటరు నీటిలో 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2 మిల్లీలీటర్ల క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

శనగపచ్చ పురుగు : ఈ పురుగు లేత ఆకుల మీద, పూమొగ్గల మీద, కాయల మీద విడిగా ఒక్కొక్క గుడ్డు పెడుతుంది. గుడ్డు నుంచి వెలువడిన పిల్ల పురుగులు పత్రహరితాన్ని పూమొగ్గలను గీకి తింటుంటాయి. తదుపరి మొగ్గలు, కాయలు, పూలను తొలచి నష్టపరుస్తాయి. ఇవి కాయ లోపలికి తలను ఉంచి, మిగిలిన శరీరాన్ని బయటే ఉంచి లోపల గింజలను తినేస్తాయి. ఒకే పురుగు చాలా పంటకు నష్టం కలిగిస్తుంది. ఈ పురుగులు ఆశించిన కంది కాయలోని ప్రతి కణుపుకు గుండ్రని రంధ్రాలు కనిపిస్తుంటాయి.

నివారణ : వేసవి దుక్కులు లోతుగా దున్నాలి. జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుములు, ఉలవలు, మెట్టవరి పైర్లను పంట మార్పిడిగా వేస్తుండాలి. పొలం చుట్టూ రక్షణ పంటగా జొన్నను సాగు చేసుకోవాలి. పచ్చ పురుగును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. పైరు విత్తిన 90–100 రోజుల వ్యవధిలో చిగుళ్లను ఒక అడుగు మేర కత్తిరించాలి. విత్తిన 100 రోజుల తరువాత పైరు మధ్యలో అక్కడక్కడా సుమారు 50 బంతి మొక్కలను నాటుకోవాలి. పూత దశ నుంచి లింగాకర్షక బుట్టలను హెక్టారుకు 10 చొప్పున ఏర్పాటు చేసుకుని, శనగ పచ్చ పురుగు ఉనికిని గమనించి దానికి అనుగుణంగా నివారించుకోవాలి. పురుగులను తినే పక్షులను ఆకర్షించేందుకు వీలుగా హెక్టారుకు 50 చొప్పున టీ ఆకారపు కర్రలను ఏర్పాటు చేసుకోవాలి. దీనిపై పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.

కాయ ఈగ – తల్లి పురుగులు నల్లటి ఈగ ఆకారంలో ఉండి కంది పిందెలు, కాయలపై కవచాల్లోకి తమ ప్రత్యేక అవయవాలతో గుడ్లను లోపలికి చొప్పిస్తాయి. వీటి నుంచి వెలువడే తెల్లని కాళ్లులేని పిల్ల పురుగులు కాయలోని గింజల పైభాగంలో దారులు చేసుకుంటూ పెరుగుతాయి. ఈ క్రమంలో ఇవి గింజ లోపలి భాగమంతా డొల్లగా చేస్తాయి. కాయ లోపలి పురుగు మొక్క ఉనికిని కాయ కవచంపై ఏర్పడే పల్చటి పొర ద్వారా గుర్తించవచ్చు. కాయ నుంచి పురుగు వెలువడిన గుర్తుగా చిన్న రంధ్రం కాయ పైభాగంలో ఏర్పడుతుంది.

నివారణ : తల్లి పురుగులను గుర్తించి వాటి వ్యాప్తిని అదుపులో ఉంచేందుకు లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పురుగు గుడ్లను, తొలి దశ పురుగులను గమనించిన వెంటనే 5 శాతం వేప గింజల కషాయాన్ని లేక వేప సంబంధిత మందులను వాడుకోవాలి. శుద్ధి చేసిన ఎన్‌పీ వైరస్ ద్రావణాన్ని ప్రతి హెక్టార్‌కు 500 లార్వాల సమానమైన ద్రావణం లేదా బ్యాక్టీరియా సంబంధమైన మందు హెక్టార్‌కు వెయ్యి గ్రాములు ఒక వారం తేడాతో రెండుసార్లు చలికాలంలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. ల్వారా పురుగులను గుర్తించి ఆ చెట్లను ఊపటం ద్వారా అవి కిందపడిన వెంటనే వేరి నాశనం చేయాలి.

- పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే తొలిపూత దశలో ఉన్న సమయంలో క్లోరిఫైరిఫాస్ 2.5 లీటర్లు, పూత, కాయదశలో క్వినాల్‌ఫాస్ 2 లీటర్లు లేదా 750–1000 లీటర్ల నీటిలో కిలో ఎసిఫేట్‌ను కలిపి హ్యాండ్ కంప్రెషన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి.

ఎండు తెగులు : నేలలో తగినంత తేమ ఉన్నప్పటికీ కంది మొక్కలు నీటి ఎద్దడికి గురవుతున్నట్లుగా వడలి పోతుంటాయి. ఆకులు నిటారుగా ఉండక వాడిపోయినట్లుగా ఉంటాయి. ఆకులు పసుపు రంగుకు మారి వేలాడుతుంటాయి. పై కొమ్మ వద్ద ఎండటం ప్రారంభమై కింది కొమ్మ వరకు వ్యాపిస్తుంది. మొక్కలు ఎండిపోయిన ఆకులు మొక్కకు అతుక్కునే ఉంటాయి. తెగులు తొలి దశలో కాండం మీద బెరడును తొలగించి చూస్తే నలుపు చారలు కనిపిస్తాయి. తరువాత కాండం మొత్తం నల్లగా మారిపోతుంది. ఈ తెగులును ఆశించే బూజు శిలీంద్రం నేలలో ఎన్నో ఏళ్ల వరకు జీవించి ఉండి 3 మీటర్ల మేర వ్యాపిస్తుంది. ఇది ఉదజని సూచికను 4.6 నుంచి 9.0 వరకు నేలలో ఉష్ణోగ్రతను 35 సెంటిగ్రేడ్ వరకు తట్టుకోగలదు.

- **నివారణ :** ఎండు తెగులును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. పొగాకు లేదా జొన్న పంటలలో మార్పిడి చేసుకోవాలి. రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్‌ను 100 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పండి కలిపి నీళ్లు చల్లి, బస్తాలో నీడలో ఉంచాలి. మూడురోజులకు ఒకసారి నీళ్లు చల్లుతూ 10 రోజుల తర్వాత ఆకు పచ్చని శిలీంద్రం కనిపించగానే ఈ ఎరువును ఒక ఎకరం పొలంలో చల్లాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్‌తో కలిపి విత్తన శుద్ధి చేసిన అనంతరం విత్తుకుంటే ఎండు తెగులు నుంచి పైరును కాపాడుకునే అవకాశం ఉంటుంది.